సాక్షి
కామారెడ్డి
మంగళవారం । 11 । ఏప్రిల్ । 2023



పరిశోధనలతోనే అభివృద్ధి
పరిశోధనలతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని తెలంగాణ యూనివర్సిటీ వీసీ రవీందర్ గుప్తా పేర్కొన్నారు.
- 8లో ▸



ఫిర్యాదులను పరిష్కరించాలి
కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో 58 ఫిర్యాదులు నమోదయ్యాయి. ట్రైనీ కలెక్టర్ వినతులు స్వీకరించారు.
- 8లో ▸


గరిష్టం/కనిష్టం
39.9 /18.2

వాతావరణం
ఉదయం ఆహ్లాదంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వడగాలులు వీస్తాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.



క్షణికావేశం.. తీరని విషాదం

- చిన్నచిన్న కారణాలతో ఆత్మహత్యలు
- జిల్లాలో వంద రోజుల్లో 110 మంది బలవన్మరణం
- ఆందోళన కలిగిస్తున్న అర్ధంతర మరణాలు



క్షణికావేశం నిండు జీవితాన్ని బలితీసుకుంటోంది. కన్నోళ్లకు, కట్టుకున్నోళ్లకు తీరని విషాదాన్ని మిగులుస్తోంది. తల్లి మందలించిందనో.. పెళ్లి కావడంలేదనో.. బంగారం కొనడానికి భర్త డబ్బులు ఇవ్వడం లేదనో.. ఐస్‌క్రీం కొనడానికి తల్లి డబ్బులు ఇవ్వలేదనో.. పుట్టిన రోజున కేక్ కట్ చేయడానికి తల్లి రాలేదనో.. ఇలా ఏ సమస్యకైనా ఆత్మహత్యే పరిష్కారంగా భావించి అర్ధంతరంగా తనువు చాలిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.

సాక్షి, కామారెడ్డి: మానసిక ఒత్తిడిని జయించలేక భవిష్యత్ అంధకారంగా కనిపించి నిస్సహాయుడవుతున్న సమయాన.. ఒంటరినన్న భావన పెరిగిపోయి జీవితంపై విరక్తి చెందుతున్న వ్యక్తులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా యువత ఆత్మన్యూనత, అభద్రత భావాలతో తమకు తామే మరణ శిక్ష విధించుకుంటున్నారు. వీరి ఉజ్వల భవితపై ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను వదిలి కానరాని లోకాలకు వెళుతున్నారు. నిత్యం ఎక్కడోచోట చిన్నచిన్న కారణాలతో తమ విలువైన ప్రాణాలను బలి తీసుకుంటూనే ఉన్నారు. జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు 110 మంది ఆత్మహత్య చేసుకున్నారు. ఇందులో ఎక్కువగా యువకులు, నడి వయసు వారే ఉండడం గమనార్హం. వరుసగా చోటు చేసుకుంటున్న బలవన్మణాలు సమాజాన్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి.

సగం మంది ఉరేసుకుని..

ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలు, ఉపాధి సమస్య.. ఇలా ఏదో ఒక సమస్యతో బాధపడుతూ క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. పేదరికం, వ్యసనాలు కూడా ఆత్మహత్యలకు కారణమవుతున్నాయి. చనిపోతున్న వారిలో యువకులే ఎక్కువగా ఉంటుండడం ఆందోళన కలిగిస్తోంది. ఆత్మహత్యలకు పాల్పడ్డవారిలో చాలామంది ఉరి వేసుకున్నారు. జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు 110 మంది ఆత్మహత్య చేసుకోగా.. అందులో 65 మంది ఉరి వేసుకుని తనువు చాలించినవారే.. 31 మంది పురుగుల మందు తాగారు. ఒకరు ఒంటిని కాల్చుకుని, పదమూడు మంది నీటిలో దూకి ఆత్మహత్యలకు పాల్పడ్డారు. చెట్టంత ఎదిగిన కొడుకులు, కూతుళ్లు తమ కళ్లెదుటే కాటికి చేరుతుండడంతో తల్లిదండ్రుల గుండె తల్లడిల్లుతోంది. చాలా కుటుంబాల్లో చేతికందిన కొడుకు చనిపోవడంతో తల్లిదండ్రులు రోడ్డున పడుతున్నారు.

సమస్యలను అధిగమించలేక...

చనిపోయిన వారిలో చాలామంది చిన్నచిన్న కారణాలతోనే ఆత్మహత్యలకు పాల్పడినట్టు స్పష్టమవుతోంది. స్త్రీల ఆత్మహత్యలకు సంబంధించి పాఠశాల, కళాశాల స్థాయిలలో త్వరితగతిన సమస్యలను అధిగమించలేక, మానసిక ఒత్తిడితో కుంగుబాటుకు గురై నిర్ణయాలు తీసుకుంటున్నారు. లైంగిక వేధింపులకు గురైనవారు తమ బాధను ఎవరికీ చెప్పుకోలేక, విషయం నలుగురికి తెలిస్తే ఇబ్బందిపడాల్సి వస్తుందన్న ఆందోళనతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. జిల్లాలో తల్లి తిట్టిందని ఓ కొడుకు ఉరేసుకున్నాడు. పెళ్లి కావడంలేదని మనస్తాపం చెంది ఓ యువకుడు.. బంగారం కొనుక్కోవడానికి భర్త డబ్బులు ఇవ్వలేదని ఓ భార్య.. ఐస్ క్రీం కొనడానికి తల్లి డబ్బులు ఇవ్వలేదని ఇంటర్ విద్యార్థి ఉరేసుకున్నారు. పనికి వెళ్లాలంటూ తల్లి మందలించడంతో ఓ కొడుకు.. పుట్టిన రోజున కేక్ కట్ చేయడానికి తల్లి రాలేదని ఇంకో తనయుడు ఆత్మహత్య చేసుకుని కన్నవారికి కడుపుకోత మిగిల్చారు.

ప్రతికూల ఆలోచనలను దూరం చేయాలి



మానసిక కుంగుబాటుకు గురవుతున్న వారి విషయంలో కుటుంబ సభ్యులు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే వారిని బతికించుకోవచ్చు. ముఖ్యంగా సమయానికి నిద్రపోయేలా వారిని ప్రోత్సహించాలి. మొబైల్ వాడకం తగ్గించడం, స్నేహితులు, కుటుంబ సభ్యులతో తరచూ మాట్లాడేలా చూడాలి. కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేయడం, వారు పడుతున్న ఇబ్బందులను తెలుసుకుని మేమున్నామనే ధైర్యాన్నివ్వడం, జీవించడానికి కావలసిన అవకాశాలు కల్పించడం, మంచి చెడుల గురించి చర్చించి అవగాహన కల్పించడం ద్వారా ఆత్మహత్య ఆలోచనల నుంచి దూరం చేయొచ్చు. – రమణ, సైకియాట్రిస్ట్, కామారెడ్డి

26 మంది విద్యార్థుల గైర్హాజరు



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

కామారెడ్డి టౌన్: జిల్లాలో సోమవారం జరిగిన పదో తరగతి పరీక్షలకు 26 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 11,899 విద్యార్థులకుగాను 11,873 మంది పరీక్ష రాశారు. 99.78 హాజరుశాతం నమోదయ్యింది. కామారెడ్డి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాల, లయోలా హైస్కూళ్లలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను కలెక్టర్ జితేష్ వి పాటిల్ తనిఖీ చేశా రు. పరీక్ష కేంద్రాల్లోని వసతులను పరిశీలించారు.

13న మహిళలకు ఐటీసీ జాబ్‌మేళా

కామారెడ్డి అర్బన్: మహిళలకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కల్పన కోసం ఈనెల 13న ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లో జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా ఉపాధి కల్పనాధికారి మధుసూదన్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మనోహరాబాద్‌లోని ఐటీసీ కంపెనీలో పలు పోస్టుల భర్తీకి జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని, నెలకు వేతనం రూ. 13,400 అందిస్తారని పేర్కొన్నారు. ఐటీఐ, ఒకేషనల్ కోర్సులు చేసిన 18 నుంచి 30 ఏళ్లలోపు మహిళా అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తిగలవారు విద్యార్హత పత్రాలు, ఫొటోలతో కలెక్టరేట్‌కు రావాలని, వివరాలకోసం 70176 86498, 98482 37987 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

న్యూస్‌రీల్

5,201 మందికి కంటి పరీక్షలు

కామారెడ్డి టౌన్: జిల్లాలో సోమవారం కంటి వెలుగులో 5,201 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 617 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. జిల్లాలో ఇప్పటివరకు 2,85,388 మందికి కంటి పరీక్షలు చేసి, 29,624 మందికి కంటి అద్దాలను అందించామని వైద్యాధికారులు తెలిపారు.

రిటైర్డ్ ఉద్యోగుల నిరసన దీక్ష



కామారెడ్డి టౌన్: రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉద్యోగులు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగేళ్లుగా తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఈహెచ్‌ఎస్ కార్డులు జారీ చేసినా నగదు రహిత వైద్య చికిత్సలకు నోచుకోక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. పూర్తిస్థాయిలో వైద్య సదుపాయం కల్పించాలని కోరారు. పెన్షన్ ఎప్పుడు వస్తుందో తెలియక రోజూ బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు విఠల్‌రావు, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బురుగుకుంటలో బంగారు వర్ణం చేపలు




దోమకొండ : దోమకొండ గ్రామ శివారులోని ముత్యంపేట రోడ్డులో ఉన్న బురుగుకుంటలో సోమవారం బంగారు తీగ చేపలు వలలో పడ్డాయని మత్స్యకార సంఘం ప్రతినిధులు తెలిపారు. కుంటలో దోమకొండలో పాటు, ముత్యంపేట గ్రామానికి చెందిన మత్స్యకారుల భాగస్వామ్యం ఉందన్నారు. చేపలు పట్టడానికి కుంటలో వలలు వేయగా, బంగారు వర్ణం చేపలు జాలరులకు చిక్కాయి. ఇవి చూపరులను ఆకట్టుకున్నాయి. వీటిని కిలో రూ.200 చొప్పున మార్కెట్‌లో విక్రయించారు.

జొన్న కొనుగోలు చేయాలి



పిట్లం: సహకార సంఘాల పరిధిలో జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని తిమ్మనగర్, చిన్నకొడప్‌గల్, కారేగాం సహకార సంఘ చైర్మన్లు సాయిరెడ్డి, నారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డిలు సోమవారం నిజామాబాద్ మార్క్‌ఫెడ్ కార్యాలయంలో డీఎం రంజిత్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పిట్లం మండలంలో ఎక్కువ మంది రైతులు జొన్న పంట సాగు చేశారని పేర్కొన్నారు.

నేడు లింగాపూర్‌కు ప్రభుత్వ విప్ రాక



కామారెడ్డి రూరల్: మున్సిపల్ పరిధిలోని లింగాపూర్‌లో మంగళవారం జ్యోతీరావు పూలే, సావిత్రి బాయి విగ్రహాల ఆవిష్కరణ, డ్వాక్రా, అంగన్వాడీ భవనాల ప్రారంభోత్సవంలో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ పాల్గొంటారని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

నర్సరీలను సంరక్షించాలి



మాట్లాడుతున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

- సేంద్రియ ఎరువులు తయారు చేయాలి
- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

కామారెడ్డి క్రైం : నర్సరీలను సంరక్షించాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం మండల స్థాయి అధికారులతో పల్లె ప్రగతి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో 100 శాతం ఇంటి పన్నులను వసూలు చేయాలన్నారు. వైకుంఠధామాల్లో విద్యుత్ సౌకర్యం, నీటి వసతి కల్పించాలన్నారు. చుట్టూ బయో ఫెన్సింగ్ చేయించాలన్నారు. వచ్చే హరితహారం కార్యక్రమానికి మొక్కలు ఏపుగా పెరిగే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అవెన్యూ ప్లాంటేషన్‌లో నాటిన మొక్కలు ఏపుగా పెరిగేలా నీటిని అందించాలన్నారు. గ్రామాల్లోని కాంపోస్టు షెడ్లను వినియోగించి సేంద్రియ ఎరువులు తయారు చేయాలని సూచించారు. సమావేశంలో డీపీవో శ్రీనివాసరావు, డీఎల్‌పీవోలు సాయిబాబా, సురేందర్, శ్రీనివాస్, ఎంపీవోలు పాల్గొన్నారు.

అభినందనీయం..



పెద్దమల్లారెడ్డి పంచాయతీ కారోబార్‌ను సన్మానిస్తున్న అదనపు కలెక్టర్

భిక్కనూరు : వందశాతం పన్నులు వసూలు చేయడం అభినందనీయమని అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. సోమవారం వంద శాతం పన్నులు వసూలు చేసిన మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామపంచాయతీ కారోబార్ యాదగిరిని ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్టిపర్పస్ వర్కర్లను ప్రోత్సహించేందుకు అధికార యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రతి మల్టిపర్పస్ వర్కర్లు గ్రామాల అభివృద్ధిలో ముఖ్య పాత్ర పోషిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డీపీవో శ్రీనివాస్‌రావు, డీఎల్‌పీవో సాయిబాబా, ఎంపీడీవో అనంత్‌రావు, ఎంపీవో ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్



ఇబ్రాహింపేట్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

బాన్సువాడ రూరల్ (బాన్సువాడ) : రైతుల కోసం వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. బాన్సువాడ మండలంలోని ఇబ్రాహింపేట్, రాంపూర్ తండాల్లో సోమవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్ వరి ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 360 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో కంటే బయటి మార్కెట్‌లో ఎక్కువ ధర లభిస్తే అమ్ముకోవచ్చన్నారు. స్పీకర్ పోచారం, రాష్ట్ర ప్రభుత్వ కృషితో ఈసారి తొందరగానే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ చెప్పారు. ఆర్డీవో రాజాగౌడ్, ఎంపీపీ నీరజారెడ్డి, జెడ్పీటీసీ పద్మారెడ్డి, రైతుబంధు జిల్లా అధ్యక్షులు అంజిరెడ్డి, ఇబ్రహింపేట్, రాంపూర్ తండా సర్పంచ్‌లు నారాయణ రెడ్డి, లలితా శ్రీనివాస్, వైస్ ఎంపీపీ హరిసింగ్, నాయకులు మోహన్ నాయక్, అంబర్ సింగ్, సాయిరెడ్డి, మోహన్‌రెడ్డి, గోపాల్ రెడ్డి, సాయిలు యాదవ్, ఉద్దెర హన్మండ్లు తదితరులు పాల్గొన్నారు.

మండలాల వారీగా బస్సులు ఏర్పాటు చేయాలి..

కామారెడ్డి క్రైం : హైదరాబాదులో జరిగే అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు వెళ్లేందుకు ప్రతి నియోజకవర్గానికి ఆరు ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈనెల 14న హైదరాబాదులో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ. సమావేశం ఉన్నందున మండలాల వారిగా బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశానికి వచ్చే వారికి తాగునీరు, భోజన సదుపాయం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఎస్పీ శ్రీనివాసరెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ దోత్రే, డీఆర్‌డీఓ సాయన్న, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, డీటీఓ వాణి, ఆర్టీసీ డీఎం మల్లేశం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి'




నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

కామారెడ్డి టౌన్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీపై తక్షణమే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని యువజన కాంగ్రెస్ నాయకులు చందు, సందీప్ డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో సోమవారం యువజన కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐల ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఇంటి ముట్టడికి యత్నించారు. పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా చందు, సందీప్ మాట్లాడుతూ ప్రశ్నపత్రాల లీకేజీపై 15 రోజులుగా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేకపోతే సీఎం క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. ఆందోళనలో నాయకులు శ్రీనివాస్, రాజశేఖర్, భరత్, శ్రీధర్, ప్రవీణ్, సురేష్, నందు, ప్రశాంత్, సోఫియాన్, వంశీ, ప్రదీప్, నిఖిల్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మార్పుల్లేవ్.. చేర్పుల్లేవ్..

- రేషన్ కార్డుల కోసం వేయికళ్లతో ఎదురుచూపులు
- ఐదేళ్లుగా పెండింగ్‌లోనే దరఖాస్తులు



కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి గ్రామానికి చెందిన గోలి నరేష్ కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లిలో నివాసం ఉంటూ సైకిల్ టెక్సీ నడిపిస్తున్నాడు. వివాహంకంటే ముందు తన తల్లిదండ్రులు, అన్నతో పాటు నరేష్‌కు ఒకే రేషన్ కార్డు ఉండేది. అయితే అన్నదమ్ములకు 2014లో వివాహమైంది. దీంతో రేషన్ కార్డులు వేర్వేరు చేసుకుందామని అ కార్డు నుంచి పేర్లు తొలగించుకుని 2018లో కొత్తగా దరఖాస్తు పెట్టుకున్నారు. ఏళ్లు గడుస్తున్నా రేషన్‌కార్డులు ఇవ్వకపోవడం, పేర్లు చేర్చుకోకపోవడంతో అనేక కుటుంబాలు రేషన్ సరుకులు పొందే అవకాశాన్ని కోల్పోతున్నాయి. జిల్లావ్యాప్తంగా 21, 643 మంది రేషన్ కార్డులో పేరు నమోదు, పేరు మార్పిడి కోసం ఎదురు చూస్తున్నారు.

పౌరసరఫరాల శాఖ నిర్లక్ష్యం..

రేషన్ కార్డు కోసం ప్రజావాణిలో ఫిర్యాదు చేయడం కార్యాలయాల చుట్టూ తిరగడం తంతుగా మారింది. బోగస్ కార్డులు ఏరివేసేందుకు 2019లో ప్రత్యేక డ్రైవ్ చేపట్టినప్పటికీ కొత్తగా పెళ్లయినవారు.. సంతానం కలిగిన వారికి ఏళ్లుగా నిరీక్షణ అనివార్యమైంది. పౌరసరఫరాల శాఖ అధికారుల నిర్లక్ష్యంతో వేలమంది నిట్టూర్చాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లాలో రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య 21,643 కామారెడ్డి అర్బన్‌తో పాటు జిల్లాలోని 24 మండలాల్లో భారీగా అర్జీలు రాగా పరిశీలించి మంజూరు చేయాల్సిన యంత్రాంగం మొద్దునిద్రలో జోగడం ప్రస్తుత దుస్థితికి కారణం. ఆర్జీల్లో వివిధ కారణాలతో 991 తిరస్కరణకు గురవ్వగా మిగితావి వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్నవి.

మీసేవ కేంద్రాల ద్వారా..

మీ సేవ కేంద్రాల ద్వారా అర్జీదారులు దరఖాస్తు చేయగా వాటిని ఆర్‌ఎస్‌ఐ (గిర్దావర్) క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైతే తహసీల్దార్‌కు నివేదిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ. 2 లక్షలకు మించని కుటుంబాలే అర్హులు. కుటుంబంలోని సభ్యులందరి ఆధార్ జిరాక్స్ ప్రతులను దరఖాస్తుకు జత చేయాలి. దరఖాస్తులను రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. ఆర్ఐ తహసీల్దార్ ఆమోదించిన అర్జీలను డిజిటల్ సైన్‌లో ఆమోదం తెలపాల్సి ఉండగా ప్రస్తుతం ఈ ప్రక్రియ నిరవధికంగా ఆగిపోయింది.

తొలగింపులో శ్రద్ధ.. మంజూరులో ఏదీ..?

రేషన్ సరుకులతో పాటు వైద్యసేవలు, ఇతర పథకాలకు రేషన్ కార్డు తప్పనిసరి. ఈ క్రమంలో దరఖాస్తు చేయడమే తరువాయి క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం కార్డు మంజూరు చేయాల్సి ఉండగా అధికారుల నిర్లక్ష్యం వెంటాడటం విడ్డూరం. అయితే కొత్తకార్డులు, కార్డులో పేర్లు చేర్పు వంటి వాటికి గత ఐదేళ్లుగా అవకాశం లేకపోగా తొలగింపుల ప్రక్రియ మాత్రం ఏటా సాగుతోంది. రేషన్‌కార్డులను ఆసరాతో అనుసంధానించారు. రేషన్‌కార్డులో పేరు తొలిగించిన వెంటనే ఆసరా కూడా కట్ అయిపోతోంది.

గజిబిజీ గందరగోళం!

- మాధవనగర్ ఆర్వోబీ పనులతో రోడ్డు మూసివేత
- ఓ వైపు వంతెన పనులు.. మరోవైపు బైపాస్ విస్తరణ
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ జిల్లా కేంద్రం నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే రహదారిలో మాధవనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి పనుల ప్రారంభంతో ప్రజలు హర్షిస్తున్నప్పటికీ, రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

మాధవనగర్ ఆర్వోబీ పనులను నాలుగు నెలల క్రితం ప్రారంభించారు. ఈ క్రమంలో వాహనాలను కంఠేశ్వర్ బైపాస్ మీదు గా మళ్లించారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ ఇదే సమయంలో బైపాస్ రోడ్డు విస్తరణ పనులు మూడు నెలల కిందట ప్రారంభించారు. ఈ రోడ్డు విస్తరణకు సంబంధించి ఒకవైపు కంకర వేసి పనులను అర్ధాంతరంగా నిలిపేశారు. అదేవిధంగా కంఠేశ్వర్ వద్ద ఫులాంగ్ బ్రిడ్జి పనులు సైతం పిల్లర్లు వేసి ఆపేశారు. ఈ క్రమంలో ట్రాఫిక్ మొత్తం 24 గంట ల పాటు బైపాస్ మీదుగా ఉన్న నేపథ్యంలో రోడ్డు ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడిందని వాహనదారు లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో విధులు నిర్వహిస్తూ ద్విచక్రవాహనాలపై రాకపోకలు సాగించేవారికి ప్రాణసంకటంగా మారింది. రెండు పనులను ఒకేసారి సమాంతరంగా ప్రారంభించడంతో ప్రమాణికులకు తిప్పలు తప్పడం లేదు. ప్రత్యామ్నాయం సక్రమంగా లేకుండా ఇలా పనులు చేస్తుండడంపై విమర్శలు వస్తున్నాయి. ఇక బోర్గాం(పి) నుంచి మోపాల్, కంజర్, ముల్లంగి, ఘన్‌పూర్, డిచ్‌పల్లి మీదుగా హైదరాబాద్ వెళ్లే వాహనాలను మళ్లిస్తున్నప్పటికీ వినాయక్‌నగర్ ప్రాంతం వారు మాత్రమే వెళ్తున్నారు. మరోవైపు ద్విచక్రవాహనాలు వెళ్లేందుకు మాధవనగర్ ఎడమవైపు నుంచి బైపాస్ వరకు ఉన్న రైల్వే అండర్‌పాస్ వద్ద భారీగా నీళ్లు నిలుస్తున్నాయి. ఇక మాధవనగర్ నుంచి కుడివైపు బర్ధిపూర్ రైల్వే అండర్‌పాస్ ఉంది. అక్కడ కూడా కొంతమేర నీళ్లు నిలుస్తున్నాయి. అంతేకాకుండా రోడ్డు ఇరుకైన మట్టి రోడ్డుతో పాటు గుంతలమయంగా ఉండడంతో వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో పలువురు ద్విచక్రవాహనదారులు మాధవనగర్ రైల్వే గేట్ వద్ద, పనులకు సంబంధించి మెటీరియల్ తెచ్చేందుకు నడిచే వాహనాల కోసం తీసిన మార్గంలో రాకపోకలు సాగిస్తున్నారు. అత్యధిక వాహనదారులు కంఠేశ్వర్ సర్కిల్ నుంచి బైపాస్ మీదుగా వెళుతున్నారు.

క్లుప్తంగా

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. నగరంలోని ధర్నా చౌక్‌లో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మామిడ్యాల రవీందర్ అధ్యక్షతన సమస్యల సాధన కోసం సోమవారం నిరసన దీక్ష చేపట్టారు. పెన్షనర్లకు క్యాష్‌లెస్ వైద్య సేవలు అందించాలన్నారు. దీక్షకు పీఆర్‌టీయూ నాయకుడు మోహన్ రెడ్డి సంఘీభావం తెలిపారు. దీక్ష అనంతరం కలెక్టరేట్లో వినతిపత్రం అందజేశారు.పి భోజాగౌడ్, పి ఆశ య్య, జి రవీందర్‌రెడ్డి,స్వామిదాస్ పాల్గొన్నారు.

స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు అభినందనీయం



నిజామాబాద్‌నాగారం: ఇందూరు యువత సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛంద సేవ చేయడం అభినందనీయమని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని దుబ్బ ప్రాంతంలో ఉన్న ఇందూరు యువత సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆకలి తీర్చే అన్నరథం వాహనాన్ని కలెక్టర్ ప్రారంభించారు.అనంతరం ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయాన్ని సందర్శించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలకి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు మద్దుకూరి సాయిబాబు, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్, ఇందూరు క్యాన్సర్ ఆస్పత్రి డాక్టర్ ప్రద్యుమ్న, రామేశ్వర్ రెడ్డి, చిటిమిల్ల హరిప్రసాద్, సంజీవన్ రావ్, కాసర్ల నరేష్ రావు పాల్గొన్నారు.

క్రెడిట్ కార్డు యాక్టివేషన్ పేరిట టోకరా

కామారెడ్డి క్రైం: బ్యాంకు అధికారుల మాదిరిగా ఫోన్ చేసి ఓ వ్యక్తికి రూ.19,999 టోకరా వేశారు సైబర్ మోసగాళ్లు. ఈ ఘటన కామారెడ్డిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన చందుపట్ల నాగరాజు లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. ఆయన కొద్ది రోజులుగా యాక్సిస్ బ్యాంకు ఇండియన్ ఆయిల్ క్రెడిట్ కార్డును వాడుతున్నారు. అతనికి యాక్సిస్ బ్యాంకు వారు మరొక క్రెడిట్ కార్డును నెల రోజుల క్రితం పంపారు. కానీ నాగరాజు కొత్త కార్డును యాక్టివేట్ చేసుకోలేదు. ఈ నెల 5న ఓ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి బ్యాంకు నుంచి మాట్లాడుతున్నాననీ, మీకు వచ్చిన క్రెడిట్ కార్డును యాక్టివేట్ చేస్తానని నమ్మించాడు. అందుకుగాను పంపిన ఓటీపీ చెప్పమన్నాడు. నాగరాజు ఓటీపీ చెప్పగానే అతడి అకౌంట్లో నుంచి 19,999 కట్ అయ్యాయి. మోసం జరిగినట్లు గుర్తించి వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయడంతో పాటు సోమవారం పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ నరేష్ తెలిపారు.

పరిశోధనలతోనే దేశాభివృద్ధి



మాట్లాడుతున్న తెయూ వీసీ డి రవీందర్, ఐసీఎస్ఎస్ఆర్ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, శిక్షణ తరగతులకు హాజరైన పరిశోధకులు, అధ్యాపకులు

తెయూ(డిచ్‌పల్లి): ఆధునిక పరిశోధనలతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని తెలంగాణ యూనివర్సిటీ వీసీ డి రవీందర్ అన్నారు. తెయూ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాల సెమినార్ హాల్‌లో 'ఆన్‌సైట్ రిసెర్చ్ మెథడాలజీ కోర్స్ ఫర్ పీహెచ్‌డీ స్టూడెంట్స్ /యంగ్ ఫ్యాకల్టీ ఇన్ సోషల్ సైన్స్' అనే అంశంపై వారం రోజులపాటు జరిగే శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. ఆధునిక ప్రపంచ గమనం పరిశోధనల మీదనే ఆధారపడుతుందన్నారు. విద్యారంగం అభివృద్ధిలో పరిశోధన ప్రధానమైన అంశమని తెలిపారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు అనుకూలమైన ప్రతిపాదనలు రూపొందించే పరిశోధనలు ఆదాయ వనరులను మెరుగు పరుస్తాయన్నారు. ఆర్థిక స్థితిని సవరించాల్సిన బాధ్యత ఆర్థిక శాస్త్రవేత్తల మీద ఉందన్నారు. ఈ శిక్షణ తరగతులకు తెలంగాణతో పాటు ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, పాండిచ్చేరి, కేరళ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రలలోని సుమారు 70 మంది పీహెచ్‌డీ స్కాలర్స్ హాజరవ్వడం అభినందనీయమని వీసీ పేర్కొన్నారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్‌సైన్స్ రీసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్) యూనివర్సిటీల్లో పరిశోధనలకు తగిన ప్రోత్సాహకాలు కల్పిస్తుందని ఐసీఎస్ఎస్ఆర్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి సుధాకర్ రెడ్డి తెలిపారు. ముఖ్యంగా సామాజిక శాస్త్రాల విభాగ అధ్యాపకులు, పరిశోధకులు విభిన్నమైన అంశాలతో పూర్తి గణాంకాలతో ప్రచురణలు చేయాలని సూచించారు.

సామాజిక అభివృద్ధిలో పరిశోధన ఆవశ్యకతని గుర్తించి విద్యార్థులు, అధ్యాపకులకు ఆర్థికపరమైన సహాయాన్ని తగిన విధంగా అందజేస్తున్నామని తెలిపారు. పరిశోధన రంగానికి కావలసిన సాంకేతికతను జోడించగలిగితే ఉత్తమమైన ఫలితాలు లభిస్తాయని తెయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ విద్యావర్ధిని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహక కార్యదర్శి ఏ పున్నయ్య, తెయూ ప్రిన్సిపల్ సీహెచ్ ఆరతి, అప్లయిడ్ ఎకనామిక్స్ విభాగాధిపతి సంపత్, అధ్యాపకులు నాగరాజు, రవీందర్ రెడ్డి, స్వప్న పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమ్మె పోస్టర్ల ఆవిష్కరణ



సమ్మె పోస్టర్లు ఆవిష్కరిస్తున్న విద్యుత్ జేఏసీ నాయకులు

నిజామాబాద్‌నాగారం: విద్యుత్ ఉద్యోగుల ఉమ్మడి జిల్లా(కామారెడ్డి, నిజామాబాద్)లకు సంబంధించి జిల్లా సమావేశం పోస్టర్లు సోమవారం విద్యుత్ జేఏసీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. జేఏసీ చైర్మన్ రఘునందన్ మాట్లాడుతూ మంగళవారం డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం గ్రామంలో పీహెచ్ఆర్ కన్వెన్షన్‌లో నిర్వహించే సన్నాహక సమావేశానికి విద్యుత్ ఉద్యోగులు తరలిరావాలన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 17 నుంచి సమ్మె నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాలేష్ కుమార్, గంగాధర్, తోట రాజశేఖర్, శ్రీనివాస్, కాశీనాథ్, గంగారాం నాయక్, సురేష్ కుమార్, నాంపల్లి, శివకుమార్, రాజేందర్, నాగరాజ్ పాల్గొన్నారు.

జువాలజీ హెచ్‌వోడీగా ప్రసన్నశీల



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ జువాలజీ విభాగం అధిపతి (హెచ్‌వోడీ)గా బయోటెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం ప్రసన్నశీల నియామకమయ్యారు. సోమవారం వీసీ రవీందర్ నియామక పత్రం అందజేశారు. ఈ పదవిలో ఆమె రెండు సంవత్సరాలు కొనసాగనున్నారు.

బిడ్డ తల్లిదండ్రుల వద్దనే ఉండాలి

బాల్కొండ: బిడ్డ తల్లిదండ్రుల వద్ద ఉండటమే క్షేమకరమని ఆర్మూర్ ఆర్డీవో శ్రీనివాస్ అన్నారు. వారం రోజుల క్రితం మెండోరా మండలం బుస్సాపూర్‌కు చెందిన సాయన్న, స్వరూప తమ బిడ్డను పోషించే స్థమత లేదని మగ శిశువును బాలల సంరక్షణ కేంద్రానికి అప్పగించారు. వారికి సోమవారం గ్రామంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. బిడ్డకు తల్లిపాలు ఎంతో ముఖ్యమన్నారు. బిడ్డను తల్లిదండ్రులు పోషించాలని సూచించారు. లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా శిశు సంరక్షణ అధికారి సుధారాణి, ఆర్డీవో శ్రీనివాస్, ఏసీడీపీఓ జ్యోతి, సర్పంచ్ సుజాత, ఉప సర్పంచ్ గంగారెడ్డి, తహసీల్దార్ సతీష్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.



బుస్సాపూర్‌లో కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పెద్దమల్లారెడ్డిలో సమావేశమైన 1983-84 బ్యాచ్ విద్యార్థులు

భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1983 – 84లో పదో తరగతి చదివిన విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమ కుటుంబ సభ్యులతో స్థానిక వీరభద్ర కల్యాణ మండపంలో సమావేశమయ్యారు. తమకు చదువు చెప్పిన గురువులను సన్మానించారు. ప్రతి ఏటా సమావేశం కావాలని, తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి చేయూత ఇవ్వాలని తీర్మానించుకున్నారు.

ఫిర్యాదులను పరిష్కరించాలి



నిజామాబాద్‌లో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, ఆర్డీవో రవి

సుభాష్‌నగర్: ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 40 ఫిర్యాదులు అందాయి. ఆయన మాట్లాడుతూ ప్రజావాణి ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. డీఆర్డీఓ చందర్, జెడ్పీ సీఈఓ గోవింద్, నిజామాబాద్ ఆర్డీఓ రవి వినతులు స్వీకరించారు.



కామారెడ్డిలో స్వీకరిస్తున్న శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, అధికారులు

కామారెడ్డిలో 58 ఫిర్యాదులు

కామారెడ్డి క్రైం: ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అధికారులకు సూచించారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 58 ఫిర్యాదులు వచ్చాయి. శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డీఆర్డీఆవో సాయన్న, ఏవో రవీందర్ తదితరులు వినతులు స్వీకరించారు.

రాయితీ రుణాలు ఎప్పుడో!

నిరీక్షిస్తున్న దివ్యాంగులు

మోర్తాడ్: దివ్యాంగులకు స్వయం ఉపాధి కోసం రాయితీ రుణాల పంపిణీకి నోటిఫికేషన్ జారీ చేసినా ఇప్పటికి అర్హులను ఎంపిక చేయకపోవడంతో ఆర్థిక సాయం అందడం లేదు. 2022–23 ఆర్థిక సంవత్సరం ముగిసి కొత్త ఏడాది మొదలైనా దివ్యాంగులకు రాయితీ రుణాలను అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాలోని దివ్యాంగులలో 35 మందిని ఎంపిక చేసి ఆర్థిక సాయం అందించాలని ఉన్నతాధికారులు నిర్దేశించారు. ఇందులో 32 మందికి రూ.50వేల చొప్పున వంద శాతం రాయితీ, బ్యాంకు లింకేజీ ద్వారా రూ.లక్ష, రూ.2లక్షలు, మరొకటి రూ.10లక్షల వరకు రుణం పంపిణీ చేయాలని నిర్ణయించారు. మండల పరిషత్ కార్యాలయాల ద్వారా గడచిన ఫిబ్రవరిలోనే దరఖాస్తులను దివ్యాంగుల నుంచి స్వీకరించారు. మార్చిలోనే అర్హులను ఎంపిక చేసి రుణాలను పంపిణీ చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు లబ్ధిదారులను ఎంపిక చేయకపోవడంతో ఎవరికి ఆర్థిక సాయం అందించలేదు. జిల్లాలో దివ్యాంగుల సంఖ్య పెరిగినా పరిమిత సంఖ్యలోనే యూనిట్లను మంజూరు చేశారు. గతంలోను ఇదే నిర్లక్ష్యం కనిపించగా ఈసారి కూడా బడ్జెట్‌లో నిధులను ఎక్కువగా కేటాయించకపోవడంతో తక్కువ మందికే రాయితీ రుణాల పంపిణీ సాగనుంది. ప్రతి మండలం నుంచి రాయితీ రుణాల కోసం వందలాది దరఖాస్తులు దివ్యాంగుల శాఖకు అందినా తక్కువ యూనిట్లను కేటాయించడంతో దివ్యాంగుల మధ్య పోటీ తీవ్రమైంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అర్హులను ఎంపిక చేసి రాయితీ రుణాలను పంపిణీ చేయాలని పలువురు కోరుతున్నారు.

లబ్ధిదారుల ఎంపికలో జాప్యం తగదు



దివ్యాంగుల శాఖ ద్వారా రాయితీ రుణాలను పంపిణీ చేయడానికి అర్హులను ఎంపిక చేయడానికి తాత్సారం చేయడం తగదు. కేటాయించిన యూనిట్లే తక్కువగా ఉన్నాయి. అందులోనూ లబ్ధిదారులను ఎంపిక చేయడంలో జాప్యం చేయడం ఎంతవరకు సమంజసం.

– సుజాత సూర్యవంశి, దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నాయకురాలు

కొనుగోలు కేంద్రాల జాడేది?

- జోరందుకున్న వరికోతలు
- రైతన్నను భయపెడుతున్న వాతావరణం
- ధాన్యం ఆరబోతకు సరిపోని స్థలం



ఆరబెట్టిన వడ్లు

సిరికొండ: సిరికొండ మండలంలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. మండలంలో యాసంగి సీజన్‌లో 25,600 ఎకరాల్లో వరి పంట సాగు అయినట్లు వ్యవసాయ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. చివరి సమయంలో భూగర్భజలాలు అడుగంటి సాగు నీటికి ఇబ్బందులు ఎదురవుతుందని యాసంగి సీజన్‌లో మండలంలో వరి నాట్లు త్వరగా వేస్తారు. గత పదిహేను రోజులుగా కోతలు నడుస్తున్నాయి. నలభై శాతం మేర కోతలు పూర్తయినట్లు అన్నదాతలు తెలిపారు. వరి కోతలు జోరుగా కొనసాగుతున్నప్పటికీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడం పట్ల అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వరి కోతలు కొనసాగుతుండటంతో మండలంలోని ఏ గ్రామంలో చూసిన ధాన్యం రాశులే దర్శనమిస్తున్నాయి. రోడ్ల వెంబడి, ఖాళీ స్థలాల్లో, పొలాల్లో ఎక్కడ పడితే అక్కడ రైతులు ధాన్యాన్ని ఆరబోస్తున్నారు. కొనుగోళ్ల ప్రారంభం కాకపోవడంతో ధాన్యం కుప్పలు పేరుకుపోతున్నాయి. కొనుగోళ్ల లేక ధాన్యం కుప్పలు అలాగే ఉండటంతో తర్వాత కోతలు చేస్తున్న రైతులకు ధాన్యం ఆరబెట్టడానికి స్థలం లభించడం లేదు. కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి కార్యాచరణ ప్రారంభించలేదు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రాజెక్టుల కింద వరి కోతలు మరో పదిహేను రోజుల తర్వాత ప్రారంభమయ్యే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం వాటిని దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలో కోతలు మొదలు కాలేదేమో అనే కోణంలో ఇంకా ధాన్యం కొనుగోళ్ల వైపు దృష్టి పెట్టడం లేదేమోనని సందేహం వ్యక్తమవుతోంది. మండలంలో ఇప్పటి వరకు కొనుగోళ్లకు సంబంధించి కేంద్రాల నిర్వాహకులు ఎలాంటి ఏర్పాట్లు మొదలు పెట్టలేదు.

మేఘావృతంతో అన్నదాతల్లో గుబులు

గత నాలుగు రోజులుగా మండలంలో వాతావరణం మేఘావృతంగా ఉంటోంది. దీంతో అన్నదాతల్లో గుబులు నెలకొంది. వరి నాట్లు పూర్తయిన అనంతరం చలి తీవ్రత పెరగడంతో పొలాలకు తెగుళ్లు వ్యాప్తి చెందాయి. పంటను కాపాడుకోవడానికి వేల రూపాయలు ఖర్చు చేసి మందులను స్ప్రే చేశారు. దొడ్డు రకం వడ్లలో మొగి పురుగు తీవ్రతతో తాలు గింజలు అయ్యాయి. గత నెల 25న వడగండ్ల వాన కురిసి వందల ఎకరాల్లో వరి పంట దెబ్బతింది. ప్రస్తుతం వాతావరణం మబ్బులు పట్టి ఉండటంతో వానలు పడితే అష్టకష్టాలు పడి పండించిన పంట నేలపాలు అవుతుందేమోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరగా ప్రారంభించాలని కోరుతున్నారు.

కేంద్రాలను ప్రారంభించాలి



రైతులు వరి కోతలు చేస్తున్నారు. మా పొలం కోసి వారం దాటింది. ధాన్యం ఎండబెట్టి కుప్ప పోశాం. వడ్ల ఇంకా కొంటలేరు. వాతావరణం మబ్బులు పడుతుండటంతో ధాన్యం తడిచిపోతుందేమోనని భయం నెలకొంది. అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి.

– సురేష్, కొండూర్

క్రైం కార్నర్

మనోవేదనతో యువకుడి ఆత్మహత్య

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి గ్రామ శివారులో రాజంపేట మండలం తలమడ్లకు చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు భిక్కనూరు ఎస్సై ఆనంద్‌గౌడ్ సోమవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. తలమడ్ల గ్రామానికి చెందిన సావుసాని లింగం (32) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. మే 4వ తేదిన ఆయన వివాహం నిశ్చయమైంది. లింగం ఆరేళ్లుగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. పెళ్లి దగ్గర పడుతుండటం.. ఆస్పత్రుల చుట్టూ తిరిగిన సమస్య నయం కాకపోవడంతో తీవ్ర మానసిక వేదనకు గురయ్యాడు. వ్యవసాయ పొలం వద్దకు వెళ్తానని ఇంట్లో చెప్పి ఆదివారం వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు పలుమార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. దీంతో పొలం వద్దకు వెళ్లి చూడగా చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు.

కుక్క దాడిలో బాలికకు గాయాలు

నందిపేట్: డొంకేశ్వర్ మండలం మారంపల్లిలో కుక్క దాడిలో పదేళ్ల చిన్నారి దర్శినికి గాయాలయ్యాయి. ఇంటి ముందర తాము పెంచుకుంటున్న కుక్కతో దర్శిని ఆడుకుంటుండగా ఊర కుక్క దాడి చేసి చేతిని కరిచింది. అంతేగాకుండా కుక్కపై సైతం దాడి చేసి గాయాలపాలు చేసింది.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

రుద్రూర్:కోటగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎక్లాస్‌పూర్ – కోటగిరి రహదారిపై వారం రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న రాందాస్ (18) మృతి చెందినట్టు ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు. ఈ నెల 4న రాత్రి కోటగిరి మండలం కొత్తపల్లి తండాకు చెందిన గుగ్లోత్ లాల్ సింగ్, సంగారెడ్డి జిల్లాకు చెందిన బర్మావత్ రాందాస్ బైక్‌పై కోటగిరి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో లాల్ సింగ్ అక్కడికక్కడే మృతి చెందాడు. రాందాస్‌ను చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైద్రాబాద్ తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

టేకు దుంగల పట్టివేత

సిరికొండ: సిరికొండ అటవీ రేంజ్ పరిధిలో గల న్యావనంది బీట్ అటవీ ప్రాంతంలో అక్రమంగా ఉంచిన టేకు దుంగలను పట్టుకున్నట్లు సిరికొండ సెక్షన్ అధికారి గంగారం తెలిపారు. సోమవారం అటవీ ప్రాంతంలోకి వెళ్లి గాలించగా ఎడ్ల బండిపై తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 15 టేకు దుంగలను పట్టుకున్నట్లు చెప్పారు. బండి వద్ద ఎవరు లేకపోవడంతో టేకు దుంగలతోపాటు ఎడ్ల బండి, ఒక ఎద్దును స్వాధీనం చేసుకొని సిరికొండ రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు గంగారం తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని ప్రధాన రహదారి పక్కన విద్యుత్ స్తంభాన్ని లారీ ఢీకొంది. ప్రధాన రహదారి పక్క నుంచి న్యూ ఆబాది కాలనీలోకి వెళ్లే దారిలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని లారీ ఢీ కొనడంతో స్తంభం విరిగి పోయింది. ఆ సమయంలో కరెంట్ సరఫరా లేక పోవడంతో పెను ప్రమాదం తప్పింది.

డ్రంకన్ డ్రైవ్ కేసులో రెండు రోజుల జైలు

కామారెడ్డి క్రైం: మద్యం తాగి వాహనం నడిపిన ఒకరికి కామారెడ్డి కోర్టు రెండు రోజుల జైలుశిక్ష విధించింది. రెండు రోజుల క్రితం దేవునిపల్లి పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా గాంధారికి చెందిన తిమ్మాపురం లక్ష్మణ్ డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. సోమవారం కోర్టులో హాజరుపర్చగా ద్వితీయశ్రేణి న్యాయమూర్తి ప్రతాప్ అతనికి జైలుశిక్ష, రూ.200 జరిమానా విధించినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

బైక్ అదుపు తప్పి ఒకరికి గాయాలు

పిట్లం: మండలంలోని ధర్మారం గేట్ సమీపంలో జాతీయ రహదారిపై టోల్‌గేట్ వద్ద సోమవారం బైక్ అదుపు తప్పి ఒకరికి తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని నాగంపల్లి గ్రామానికి చెందిన ఇస్మాయిల్ తన బైక్‌పై పెద్దకొడప్‌గల్ వైపు వెళ్తుండగా ధర్మారం టోల్ గేట్ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో ఇస్మాయిల్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. అతనిని హైవే అంబులెన్స్ సిబ్బంది చికిత్స నిమిత్తం పిట్లం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆటో బోల్తా.. ఎస్సెస్సీ విద్యార్థిని మృతి

పరీక్ష రాసి వెళ్తుండగా ఘటన



శిరీష (ఫైల్)

నిజాంసాగర్: ఎస్సెస్సీ పరీక్ష రాసి ఇంటికి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థిని మృతి చెందింది. కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలంలో జరిగిన ప్రమాదం వివరాలిలు.. బిచ్కుంద మండలం గోపన్‌పల్లి గ్రామానికి చెందిన జూకంటి శిరీష(15) సోమవారం బిచ్కుంద బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి సామాన్య శాస్త్రం పరీక్ష రాసింది. పరీక్ష ముగిసిన అనంతరం బిచ్కుంద బస్టాండ్‌కు చేరుకుంది. శిరీష అమ్మ సాయవ్వ, అమ్మమ్మ ఈరవ్వ అనారోగ్యంతో బాధపడుతుండడంతో వారు బిచ్కుందలోని ఆస్పత్రిలో చూపించుకుని బస్టాండ్‌లో నిరీక్షిస్తున్నారు. శిరీష రాగానే ముగ్గురు కలిసి స్వగ్రామానికి వెళ్లే ప్యాసింజర్ ఆటోలో ఎక్కింది. పదిమందితో కలిసి బయలుదేరిన ఆటో కొద్దిసేపటిలోనే బిచ్కుంద శివారులోని బారెడు పోచమ్మ గుడి సమీపంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో శిరీషకు తీవ్ర గాయాలు కాగా.. మిగిలిన వారందరికి ఓ మోస్తరు గాయాలయ్యాయి. స్థానికులు వారిని బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శిరీష మరణించింది. మిగతావారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. డ్రైవర్ నిర్లక్ష్యంగా అతివేగంగా వాహనాన్ని నడపడం వల్లే ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. మృతురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని బిచ్కుంద ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

అనాథైన అమ్మ..

జూకంటి సాయవ్వ భర్త పదేళ్ల క్రితం అనారోగ్యంతో మరణించాడు. అప్పటి నుంచి ఒక్కగానొక్క కూతురు శిరీషను చూసుకుంటూ జీవిస్తోంది. రోడ్డు ప్రమాదం ఆ ఒక్క ఆశనూ చిదిమేయడంతో ఆ తల్లి అనాథగా మారింది.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి



ఆశన్న మృతదేహం

జక్రాన్‌పల్లి: మండలంలోని పుప్పాలపల్లి గ్రామంలో సోమవారం ప్రమాదవశాత్తు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకడంతో టేకుమల్లే ఆశన్న (50) మృతి చెందాడు. గ్రామంలో పొలం వద్దకు వ్యవసాయ పని నిమిత్తం ఆశన్న వెళ్లాడు. పొలంను ఆనుకుని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఒడ్డుపైన ఉంది. పొలంలోకి వెళ్లే క్రమంలో ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ తగలడంతో విద్యుత్ షాక్ తగిలి ఆశన్న అక్కడికక్కడే మృతి చెందాడని ఎస్సై తెలిపారు. మృతుడి కుమారుడు అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

మద్యం మత్తులో కింద పడి ఒకరు..

ఖలీల్‌వాడి: నగరంలోని మహాలక్ష్మీనగర్ కాలనీలో ఆదివారం రాత్రి మద్యం మత్తులో కిందపడి దయానంద్(53) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

రైలు కిందపడి మరొకరు..

నవీపేట: మండలంలోని ఫకీరాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం రాత్రి రైలు కింద పడి అదే గ్రామానికి చెందిన జల్లెల సాయిలు (52) మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ సోమవారం తెలిపారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.